క్లుప్తంగా

బీజేపీ నాయకుల సంబురాలు



స్వీట్లు తినిపించుకుంటున్న నాయకులు

పెద్దశంకరంపేట(మెదక్): మహారాష్ట్ర ఎన్నికల్లో బీజేపీ కూటమి అత్యధిక స్థానాలు గెలిచి అధికారంలోకి రావడంతో మండల కేంద్రంలో బీజేపీ నాయకులు బాణాసంచా కాల్చి సంబురాలు చేసుకున్నారు. శనివారం ఈ సందర్భంగా బీజేపీ మండలాధ్యక్షుడు కోణం విఠల్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

చిన్నశంకరంపేట(మెదక్): మహారాష్ట్రలో బీజేపీ కూటమి విజయం సాధించడంతో మండల కేంద్రంలో బీజేపీ నాయకులు టపాసులు కాల్చి, స్వీట్లు పంచుకొని సంబురాలు చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు రాజు, నాయకులు పాల్గొన్నారు.

వెంటనే అన్‌లోడ్ చేయాలి



రైస్‌మిల్లును తనిఖీ చేస్తున్న తహసీల్దార్

వెల్దుర్తి(తూప్రాన్): కొనుగోలు కేంద్రాల నుంచి రైస్‌మిల్లులకు తరలించిన ధాన్యాన్ని సంబంధిత నిర్వాహకులు వెంటవెంటనే అన్‌లోడ్ చేయాలని తహసీల్దార్ కృష్ణ సూచించారు. ఈ మేరకు వెల్దుర్తిలోని రైస్‌మిల్లులను ఆయన తనిఖీ చేసి, రికార్డులు పరిశీలించారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా కేటాయించిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు అన్‌లోడ్ చేయాలన్నారు. మండలంలో సుమారు 90 శాతం కొనుగోలు ప్రక్రియ పూర్తయిందన్నారు. తనిఖీలో గిర్దావర్ జయభారత్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థుల స్నానాలకు వేడినీరు ఏర్పాటు



విద్యార్థులకు వేడినీరు పోస్తున్న వార్డెన్ యాదగిరి

సాక్షి ఎఫెక్ట్..

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రమైన శివ్వంపేటలోని ఎస్టీ బాలుర వసతిగృహం విద్యార్థుల ఇబ్బందుల గురించి సాక్షి దినపత్రికలో గురువారం చలికాలం..చన్నీటి స్నానం అనే కథనం ప్రచురితమైంది. దీంతో హాస్టల్ వార్డెన్ యాదగిరి స్పందించారు. శనివారం కట్టెల పొయ్యి మీద వేడి నీరు ఏర్పాటు చేశారు. ఉదయం 5 గంటల నుంచి 7 గంటల వరకు విద్యార్థులు వేడినీటితో స్నానం చేశారు. చలికాలంలో వేడినీరు అందేలా కృషి చేసి సాక్షి దినపత్రికకు విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

జెడ్పీపాఠశాలలో వైజ్ఞానిక ప్రదర్శన



వైజ్ఞానిక ప్రదర్శనను వీక్షిస్తున్న విద్యార్థులు

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలోని జెడ్పీపాఠశాలలో శనివారం అగస్త్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనలో మానవ శారీంలోని వివిధ భాగాలు ప్రదర్శించగా, విద్యార్థులు వీక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సైన్స్ పాఠ్యాంశానికి ఉపయోగపడే శారీరక అవయవాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం దీప్లారాథోడ్, ఉపాధ్యాయుడు పోచయ్య, అగస్త్య ఫౌండేషన్ ప్రతినిధులు శ్రీకాంత్, వెంకటేశం పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ



బ్యాగులు, పుస్తకాలు పంపిణీ చేసిన సభ్యులు

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని చందంపేట జెడ్పీపాఠశాల విద్యార్థులకు యూత్ ఫర్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థుల స్కూల్ బ్యాగులు, నోట్‌పుస్తకాలు, పెద్ద బాలశిక్ష పుస్తకాలు అందించారు. పాఠశాలలోని 6, 7వ తరగతి చదువుతున్న 57 మంది విద్యార్థులకు పంపిణీ చేసినట్లు యూత్ ఫర్ సొసైటీ నిర్వాహకులు రంగంపేట సతీశ్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాస్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

పిల్లల సంరక్షణే లక్ష్యం

ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంతోషిమాత



శివ్వంపేట(నర్సాపూర్): అవగాహన కల్పిస్తున్న టీచర్లు

చిలప్‌చెడ్(నర్సాపూర్): పిల్లల సమగ్ర అభివృద్ధి, సంరక్షణ లక్ష్యంగా ఎర్లీ చైల్డ్ హుడ్ అండ్ కేర్, ఎడ్యుకేషన్ దినోత్సవాన్ని మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంతోషిమాత అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నెలలో ప్రతి 4వ శనివారం ఈ దినోత్సవం నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి తల్లులను ఆహ్వానించి, నెల రోజుల్లో చిన్నారులు చూపించిన ప్రతిభ గురించి వారికి వివరిస్తామన్నారు. భవిష్యత్‌లో పూర్వ ప్రాథమిక విద్య, పిల్లల సమగ్ర అభివృద్ధి, సంరక్షణ సాధ్యమైనంత త్వరగా సాధించడమే లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఆయా కేంద్రాల అంగన్‌వాడీ టీచర్లు, తల్లులు, మహిళలు పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన

శివ్వంపేట(నర్సాపూర్): అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులకు, బాలింతలకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారంపై అంగన్‌వాడీ టీచర్లు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. మండల పరిధిలోని దొంతిలోని అంగన్‌వాడీ టీచర్లు హేమలత, జ్యోతి, షైమున్నీసబేగం సామూహిక సీమంతాలు, చిన్నారులకు అన్నప్రసన నిర్వహించారు. 6 నెలల దాటిన పిల్లలందరికీ తల్లిపాలతో పాటు బాలామృతం తినిపించాలని మహిళల్లో రక్త హీనత నివారణ కోసం పాలు, ఆకుకూరలు, కోడి గుడ్లు తినాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి శంకర్‌గౌడ్, సిబ్బంది భాగమ్మ, భవాని ఉన్నారు.



చిలప్‌చెడ్(నర్సాపూర్): బద్రియా తండాలో ..

చిన్నారులకు కుర్చీల అందజేత

చేగుంట(తూప్రాన్): మండలంలోని వడియారం గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాల చిన్నారులకు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రవీణ్‌కుమార్ కుర్చీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ మండల కార్యదర్శి రాంచంద్రం, మల్లేశం అంగన్‌వాడీ కార్యకర్తలు రమాదేవి, రాణి, స్రవంతి, రేణుక, ఆయాలు పాల్గొన్నారు.



వడియారంలో అంగన్‌వాడీలో..

ఓటరుగా నమోదు చేసుకోవాలి



కౌడిపల్లి(నర్సాపూర్): ఓటరు నమోదును పరిశీలిస్తున్న తహసీల్దార్ ఆంజనేయులు



శివ్వంపేట(నర్సాపూర్): ప్రత్యేక శిబిరాన్ని పరిశీలిస్తున్న ఉప తహసీల్దార్ షఫీయొద్దీన్

శివ్వంపేట(నర్సాపూర్): జనవరి 2005 వరకు 18 సంవత్సరాలు పూర్తి చేసుకునే యువతి, యువకులు ఓటుహక్కుల కోసం నమోదు చేసుకోవాలని ఉప తహసీల్దార్ షఫీయొద్దీన్ సూచించారు. ఓటుహక్కు నమోదు కోసం శనివారం పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేశారు. మండల వ్యాప్తంగా ఉన్న 52 పోలింగ్ కేంద్రాల వద్ద బీఎల్‌ఓలు ఓటరు నమోదు చేశారు. ఓటరు నమోదు ప్రక్రియను ఉప తహసీల్దార్ పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. తప్పుల సవరణతో పాటు మృతి చెందిన వారి ఓటర్ల పేర్లు తొలగిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ కిషన్, బీఎల్‌ఓలు ఉన్నారు.

ఓటరు నమోదు పరిశీలన

కౌడిపల్లి(నర్సాపూర్): ఓటరు నమోదు ప్రత్యేక కార్యక్రమాన్ని తహసీల్దార్ ఆంజనేయులు పరిశీలించారు. శనివారం మండల కేంద్రం కౌడిపల్లిలో బీఎల్‌ఓలు పోలింగ్‌బూత్ వద్ద ఓటరు నమోదు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించగా తహసీల్దార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని గ్రామాల్లో బీఎల్‌ఓలు ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు. 18 ఏళ్లు నిండినవారు కొత్తగా ఓటరు నమోదు చేసుకోవాలని సూచించారు. దీంతోపాటు ఓటరు సవరణలు, మార్పులు చేసుకోవచ్చని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆర్‌ఐ శ్రీహరి, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో వివరాల నమోదు

చిలప్‌చెడ్(నర్సాపూర్): సమగ్ర కుటుంబ సర్వేలో సేకరించిన వివరాలను ఆన్‌లైన్ నమోదు కార్యక్రమాన్ని పరిశీలించానని తహసీల్దార్ ముసాద్దీక్ అన్నారు. శనివారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమగ్ర సర్వేలో సేకరించిన వివరాలలో ఎలాంటి తప్పులు జరగకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. కుటుంబ సభ్యులు ఎన్యుమరేటర్లకు అందించిన సమాచారం గోప్యంగా ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆపరేటర్లు పాల్గొన్నారు.

డేటా నమోదు ప్రక్రియ పరిశీలన



డేటా నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న ఆర్డీవో

రామాయంపేట(మెదక్): పట్టణంలో కొనసాగుతున్న ఇంటింటి సర్వే డాటా నమోదు ప్రక్రియను శనివారం మెదక్ ఆర్డీవో రమాదేవి పరిశీలించారు. ఎంపీపీ కార్యాలయంలో కొనసాగుతున్న కార్యక్రమాన్ని ఆమె పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా నమోదు పూర్తి చేయాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రజనికుమారి, ఎంపీడీఓ సజీలుద్దీన్, ఇతర అధికారులు ఉన్నారు.

మూఢనమ్మకాల నివారణపై అవగాహన

పెద్దశంకరంపేట(మెదక్): శాస్త్రీయ విజ్ఞానం దేశాభివృద్ధికి పునాదని ఎస్‌ఐ శంకర్, సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్ జాతీయ కమిటీ సభ్యుడు నరేశ్ అన్నారు. అల్లాదుర్గం సీఐ రేణుకారెడ్డి, పేట పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, మోడల్ స్కూల్‌లో మహిళల రక్షణ - వ్యక్తిత్వ వికాసం - సైన్సు-మూఢనమ్మకాల నిర్మూలన అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సమాజంలోని మూఢనమ్మకాలను విద్యార్థులు వదిలిపెట్టి శాస్త్రీయ సమాజ నిర్మాణానికి నడుం బిగించాలన్నారు. దొంగ స్వాములు భూత వైద్యులు ప్రజల అమాయకత్వాన్ని ఆసరా చేసుకొని ఆర్థికంగా, సామాజికంగా మోసం చేస్తున్నారని ఈ విషయంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. బాల్యవివాహాలకు విద్యార్థులు దూరంగా ఉండి ఉన్నత లక్ష్యాలు చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఐ విఠల్, పోలీస్ సిబ్బంది జ్యోతి, రమేశ్, రవి, ప్రిన్సిపాల్ విజయ తదితరులు పాల్గొన్నారు.



మూఢ నమ్మకాలపై అవగాహన కల్పిస్తున్న నరేశ్

శివ్వంపేట ఎస్‌ఐగా మధుకర్‌రెడ్డి

శివ్వంపేట(నర్సాపూర్): శివ్వంపేట ఎస్‌ఐగా మధుకర్‌రెడ్డి నియమిస్తూ రాజన్న సిరిసిల్ల జోన్ డీఐజీ చంద్రశేఖర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. సిద్దిపేట కమిషనరేట్ నుంచి ఇక్కడికి మధుకర్‌రెడ్డి బదిలీపై వస్తున్నారు. గతంలో ఇక్కడ ఎస్‌ఐగా పనిచేసిన మైపాల్‌రెడ్డిని 20 రోజుల క్రితం మెదక్ ఎస్పీ కార్యాలయానికి అటాచ్ చేసి రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు.

రామాయంపేట ట్రాన్స్‌కో ఏఈగా తిరుపతిరెడ్డి



రామాయంపేట (మెదక్): రామాయంపేట ట్రాన్స్‌కో ఏఈగా తిరుపతిరెడ్డి నియమితులయ్యారు. ఈమేరకు ఆయన శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు ఇక్కడ పనిచేసిన పెంట్యానాయక్ మెదక్ బదిలీ కాగా, ఆయన స్థానంలో మెదక్ రూరల్ నుంచి తిరుపతిరెడ్డి రామాయంపేట వచ్చారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన తిరుపతిరెడ్డిని సిబ్బంది సన్మానించారు.

నేడు సామూహిక అగ్నిహోత్రం

నర్సాపూర్ రూరల్: నర్సాపూర్ పట్టణంలోని శివాలయంలో ఆదివారం సామూహిక అగ్నిహోత్రం నిర్వహిస్తున్నట్లు విశ్వ ఫౌండేషన్ శివపురి సభ్యులు శంకర్, రుద్రప్ప, శివాలయం అర్చకుడు వీరప్ప తెలిపారు.

మండలంలో 429మంది ఎమ్మెల్సీ ఓటర్లు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలో 429మంది ఎమ్మెల్సీ ఓటర్లు ఓటు హక్కును నమోదు చేసుకున్నట్లు నాయబ్ తహసీల్దార్ మహమ్మద్ జహీర్ అన్నారు. శనివారం కౌడిపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద పట్టభద్రులు, టీచర్స్ ఎమ్మెల్సీ ఓటరు జాబితాను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని వివిధ గ్రామాల్లో పట్టభద్రుల ఎమ్మెల్సీకి 329 మంది పురుషులు, 93 మంది మహిళలు మొత్తం 422 మంది ఉన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి 5 మంది పురుషులు, 2 మహిళలు మొత్తం 7 మంది దరఖాస్తు చేసుకోవడంతో ఓటుహక్కు వచ్చినట్లు చెప్పారు. ఓటరు జాబితాను తహసీల్దార్ కార్యాలయం నోటీస్ బోర్డులో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇంకా ఎవరైన అభ్యంతరాలుంటే తగిన ఆధారాలతో వచ్చేనెల 9లోపు దరఖాస్తు చేయాలని సూచించారు.

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడి

● మల్లారెడ్డి యూనివర్సిటీ విద్యార్థులు



శీలాంపల్లిలో కంది సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ విద్యార్థులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): రైతులు పంటసాగులో సరైన మెలకువలు పాటిస్తే పంటను భద్రంగా ఉంచుకోవడంతో పాటు, అధిక దిగుబడి సాధించవచ్చని మల్లారెడ్డి యూనివర్సిటీ వ్యవసాయ విద్యార్థులు అన్నారు. శనివారం వారు మండలంలోని శీలాంపల్లి గ్రామంలో గ్రామీణ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా రైతులకు కందిసాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రస్తుతం కంది పంట పూత దశలో ఉందని, ఈ సమయంలో కందికి మరుక మచ్చల పురుగు ఎక్కువగా ఆశిస్తుందన్నారు. ఈ తల్లి రెక్కల పురుగు పసుపుపచ్చని గుడ్లను పూమొగ్గలపై, లేత ఆకులపై, పిందెలపై పెడుతుందని, గుడ్ల నుంచి వెలువడిన లార్వాలు ఆకులను, పువ్వులను, కాయలను కలిపి గూళ్లుగా చేసి, మొగ్గలను, పిందెలని, కాయలని తింటాయన్నారు. తొలచిన కాయ రంధ్రం దగ్గర లార్వా విసర్జితాలు కనబడతాయని, ఈ పురుగు నివారణకు ఎకరానికి నాలుగు లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. లీటర్ నీటిలో వేపనూనే కలిపి 5 ఎంఎల్ చొప్పున మొగ్గ దశలో పిచికారీ చేయాలన్నారు. క్లోరిపైరిపాస్ 2.5 ఎంఎల్, లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. ఉధృతి మరీ ఎక్కువగా ఉంటే ఇమామెక్టిన్ బెంజోయెట్ 0.4 గ్రాము, లేదా క్లోరాంట్రానిలిప్రోల్ 0.3 ఎంఎల్, లేదా ఫ్లూబెండమైడ్ 0.3 ఎంఎల్ లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు రోహిత, శామా, సాయిప్రసన్న, అభినయ, రమ్య, రైతులు పాల్గొన్నారు.

పెట్రోల్ పంపు అనుమతులు రద్దు చేయండి

● పౌల్ట్రీ రైతుల ఆవేదన

నర్సాపూర్ రూరల్: పౌల్ట్రీతో పాటు గిరిజన రైతులను దృష్టిలో పెట్టుకొని పెట్రోల్ పంపు ఏర్పాటును రద్దు చేయాలని మండలంలోని బ్రాహ్మణపల్లికి చెందిన పాతులోత్ నర్సింగ్, గిరిజన రైతులు కలెక్టర్‌తో పాటు ఆయా శాఖల అధికారులను వేడుకుంటున్నాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పౌల్ట్రీ ఫారాలతో పాటు వ్యవసాయాన్ని నమ్ముకొని జీవిస్తున్నామని తెలిపారు. పెట్రోల్ పంపు ఏర్పాటుతో పౌల్ట్రీ ఫారాలకు పౌల్ట్రీ కంపెనీలో పిల్లలు ఇవ్వరన్నారు. పంపు ఏర్పాటుతో ఏర్పడే ధ్వని, కాలుష్యం కోడి పిల్లలు బతకవన్నారు. పెట్రోల్ పంపు ఏర్పాటుకు అనుమతులు రద్దు చేయాలని కోరుతున్నారు. పలుమార్లు ప్రజావాణితో పాటు గ్రామ కార్యదర్శి, ఎంపీడీఓ, ఇతర అధికారులకు విన్నవించిన పెట్రోల్ పంపు ఏర్పాటుకు ఎన్‌ఓసీ ఇవ్వడం విచారకరమన్నారు. ఈ విషయమై ఎంపీఓ వైద్య శ్రీనివాస్ వివరణ కోరగా.. అడిషనల్ కలెక్టర్ ఆదేశాలతో గ్రామపంచాయతీ నోటీస్ బోర్డులో ఐదు రోజుల గడువు ఇస్తూ నోటీసు అతికించి, ఎవరు అబ్జెక్షన్ చేయకపోవడంతో ఎన్‌ఓసీ ఇచ్చినట్లు తెలిపారు.

సన్నరకం పంట సాగు చేయాలి

శివ్వంపేట(నర్సాపూర్): యాసంగిలో సన్నరకం వరి పంట సాగు చేయాలని పీఏసీఎస్ చైర్మన్ చింతల వెంకట్‌రామిరెడ్డి, వైస్ చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. శనివారం పీఏసీఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసి సమావేశంలో వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం సన్నరకం వడ్లకు మద్దతు ధరతో పాటు క్వింటాల్‌కు రూ.500 బోనస్ చెల్లిస్తున్నందున రైతులకు లాభసాటిగా ఉంటుందన్నారు. ప్రస్తుతం కొనుగోలు కేంద్రాల్లో సన్నరకం ధాన్యం అమ్మకాలు చేసిన రైతుల ఖాతాల్లో బోనస్ డబ్బులు జమ అవుతున్నాయన్నారు. రైతులు దళారులకు ధాన్యం అమ్మకుండా కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. చివరి ధాన్యం గింజ వరకు కొనుగోలు చేయడం జరుగుతుందని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఈ కార్యక్రమంలో సీఈఓ మధు, డైరెక్టర్లు అంజిరెడ్డి, విరేశ్, బలవంతరెడ్డితో పాటు తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి

సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు



శివ్వంపేట(నర్సాపూర్): ఆంజనేయస్వామి ఆలయంలో సామూహిక వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని చిన్నగొట్టిముక్కలోని చాకరిమెట్ల అరణ్యంలో కొలువైన సహకార ఆంజనేయస్వామి ఆలయంలో కార్తీక సందడి నెలకొంది. శనివారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. అభిషేకం అనంతరం సత్యనారాయణస్వామి మండపంలో వందలాది భక్తులు సామూహిక వ్రతాలు ఆచరించారు. భక్తులకు ఇబ్బందులు రాకుండా ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఫౌండర్, చైర్మన్ ఆంజనేయశర్మ, ఈఓ శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకుడు దేవాదత్తశర్మ, ప్రభుశర్మ, దేవిశ్రీ, శ్రీవాత్సవ్‌శర్మ, తదితరులు ఉన్నారు.

పాపన్నపేట(మెదక్): మండలంలోని నాగ్సాన్‌పల్లి శివారులోని మురళీకృష్ణ దేవాలయంలో మాధవానంద సరస్వతి ఆధ్వర్యంలో భక్తులు సామూహిక సత్యనారాయణ వ్రతాలు ఆచరించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ నిత్యం భగవంతుడి వద్ద దీపం వెలిగిస్తే మనిషి ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో అర్చకులు శ్యాంసుందర్ శర్మ,రాజశేఖర్ శర్మ, యాబన్న, నర్సింలు, ఇంద్రసేనారెడ్డి, సాయిబాబా, మహేందర్, శ్రీనివాస్, ప్రసాద్, శ్రీకాంత్, విజయ్, భిక్షపతిగౌడ్, నర్సింలు గౌడ్, భక్తులు పాల్గొన్నారు.



పాపన్నపేట(మెదక్): నాగ్సాన్‌పల్లిలోని మురళీ కృష్ణ ఆలయంలో సామూహిక వ్రతాలు

సంక్షిప్త వార్తలు

◆ **ప్రజా పాలన విజయోత్సవాలపై సమీక్ష**

శివ్వంపేట(నర్సాపూర్): రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన ప్రజాపాలన విజయోత్సవ సంబురాలు విజయవంతం చేయాలని ఎంపీడీఓ నాగేశ్వర్ అన్నారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో ఈజీఎస్ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విజయోత్సవ సంబురాల్లో భాగంగా ఈ నెల 26 పనుల జాతర గ్రామాల వారీగా నిర్వహించాలన్నారు. కొత్త పనులను ప్రారంభించడంతో పాటు చేసిన పనుల గురించి ప్రజలకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ అనీల్, సిబ్బంది ఉన్నారు.

◆ **కళా ప్రదర్శన**

తూప్రాన్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా మండలంలోని నర్సంపల్లి, వెంకటరత్నాపూర్ గ్రామాల్లో కళాకారులు తమ ఆటపాటలతో అలరించారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచిన సందర్భంగా ఇప్పటివరకు ప్రజలకు చేరువైన, చేరనున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు, వాటి అవశ్యకతను వివరించారు.

◆ **బీవీఆర్‌ఐటీలో ఘనంగా ఫ్రెషర్స్ డే**

నర్సాపూర్ రూరల్: నర్సాపూర్ బీవీఆర్‌ఐటీ కళాశాలలో శనివారం ఘనంగా ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమానికి క్లాసికల్ నర్తకి ఆశ్రిత ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు చేసిన నృత్యాలు అందరిని అలరించాయి. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ లక్ష్మి, ప్రిన్సిపాల్ సంజయ్ దూబే, వైస్ చైర్మన్ రవిచంద్రన్ రాజగోపాల్, సెక్రెటరీ ఆదిత్య విస్సాం, డీజీఎం బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

◆ **నాణ్యతలో మేటి.. భారతి సిమెంట్**



వెల్దుర్తి(తూప్రాన్): సిమెంట్ తయారీ రంగంలో భారతి సిమెంట్ విప్లవాత్మకమైన మార్పులకు శ్రీకారం చుట్టిందని సంస్థ టెక్నికల్ సర్వీసెస్ శ్రీకాంత్ అన్నారు. శనివారం వెల్దుర్తిలోని రామలింగేశ్వర ట్రేడర్స్‌లో తాపీ మేస్త్రీలకు అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రూ.లక్ష రూపాయల ప్రమాద బీమా బాండ్‌లను అందజేశారు. అనంతరం సంస్థ టెక్నికల్ సర్వీసెస్ శ్రీకాంత్ మాట్లాడారు. ఈ సమావేశంలో చీఫ్ మార్కెటింగ్ మేనేజర్ సతీష్ కుమార్, టెక్నికల్ సర్వీసెస్ ఆఫీసర్ ప్రశాంత్, డీలర్ లింగమూర్తి, నరేందర్ రెడ్డి, తాపీ మేస్త్రీలు పాల్గొన్నారు.

◆ **పోలీస్‌స్టేషన్ తనిఖీ**

తూప్రాన్: తూప్రాన్ పోలీస్‌స్టేషన్‌ను డీఎస్పీ వెంకట్రామిరెడ్డి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రికార్డులను పరిశీలించారు. ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులపై తీసుకోవాల్సిన చర్యలపై సిబ్బందికి సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో సీఐ రంగాకృష్ణ, ఎస్‌ఐ శివానందం, సిబ్బంది పాల్గొన్నారు.

◆ **నిజాంపేటకు చేరిన పాదయాత్ర**

నిజాంపేట(మెదక్): ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ అక్టోబర్ 25న భద్రాచలంలో ప్రారంభమైన మాల మహానాడు పాదయాత్ర శనివారం సాయంత్రం నిజాంపేటకు చేరుకుంది. ఈ మేరకు జాతీయ మాలమహానాడు ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పాదయాత్ర కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఐకమత్యంతో ఉన్న దళితులను విచ్ఛిన్నం చేసి రాజ్యాధికారం రాకుండా చేస్తున్నాయని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్ర పన్నుతున్నాయని తెలిపారు. డిసెంబర్ 1న హైదరాబాద్‌కు చేరుకొని అక్కడ సభను ఏర్పాటు చేసుకోనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాల మహనాడు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

◆ **ప్రాంతీయ పార్టీలదే భవిష్యత్**

పాపన్నపేట(మెదక్): దేశ వ్యాప్తంగా ప్రాంతీయ పార్టీలదే భవిష్యత్‌ని మెదక్ మాజీ ఎమ్మెల్యే శశిధర్ రెడ్డి అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. ఈరోజు ప్రకటించిన మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలను పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమవుతుందన్నారు. మహారాష్ట్రలో ఉన్న రెండు శివసేన పార్టీలు, ఎన్సీపీ పార్టీలకు వచ్చిన ఓట్లు, సీట్లు పరిశీలిస్తే తెలుస్తుందన్నారు. ఇప్పటికిప్పుడు తెలంగాణలో ఎన్నికలు నిర్వహిస్తే బీఆర్‌ఎస్ పార్టీకి 100 సీట్లు వస్తాయని ధీమా వ్యక్తం చేశారు.

◆ **ట్రాక్టర్ కింద పడి వృద్ధురాలి మృతి**

చేగుంట(తూప్రాన్): ట్రాక్టర్ కింద పడి వృద్ధురాలు మృతి చెందిన ఘటన మండలంలోని గొల్లపల్లి గ్రామంలో శనివారం చోటు చేసుకుంది.ఎస్‌ఐ చైతన్యకుమార్‌రెడ్డి కథనం మేరకు.. గ్రామానికి చెందిన మెట్టు లక్ష్మి(73) ఇంటి బయట నడుచుకుంటూ వెళ్తుంది. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన జానేష్ ట్రాక్టర్‌ను రివర్స్ తీస్తుండగా లక్ష్మికి ట్రాలీ తగిలి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స కోసం తూప్రాన్ ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. లక్ష్మి మనవడు రాజు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

◆ **ఊర కుక్కల దాడిలో బాలుడికి తీవ్ర గాయాలు**

చిన్నశంకరంపేట(మెదక్): ఊర కుక్కల దాడిలో బాలుడికి తీవ్రగాయాలైన ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. చిన్నశంకరంపేటలో నివాసం ఉంటూ పరిశ్రమలో పని చేస్తున్న సంతోష దీప్ అనే మహిళ ఉదయం ఇంటికి తాళం పెట్టే క్రమంలో మూడేళ్ల కుమారుడు చంద్రకాంత్ ఇంటి ఆవరణలో నిల్చున్నాడు. ఇదే సమయంలో ఊర కుక్క దాడి చేసి తీవ్రంగా గాయపర్చింది. బాలుడి చేతికి, కాలుకు తీవ్రంగా గాయాలు కాగా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.